రాజు తమ్మివలస చేరేసరికి సాయంత్రం ఆరు గంటలయింది.

తమ్మివలస విశాఖపట్నం- భీమిలి రూటులో వుంది.

అది ప్రయివేటు బస్సు. దానికి బయలుదేరడానికి చేరడానికి ఒక టైమంటూ వుండదు. బస్సు నిండేవరకు క్లీనర్ అరుపులు, విజిల్సు, బస్సుని రేకు డబ్బాలా దబదబా బాదడం- ప్రయాణీకులు చచ్చినట్లు భరించాల్సిందే !

బస్సులో చేపల వాసన, చుట్టకంపు, అరుపులు, తిట్లు- కలగాపులగంగా వుంది.

రాజు జేబురుమాల్ని ముక్కు కడ్డంగా పెట్టుకొని ఆ రోజు న్యూస్ పేపర్ చదవటానికి ప్రయత్నిస్తున్నాడు.

అతని మనసు మాత్రం వీటన్నిటికీ అతీతంగా తమ్మివలసలో తాను చేయబోయే ఉద్యోగం గురించి ఆలోచిస్తోంది.

చటుక్కున జేబులోని ఎపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకుని చదువుకొన్నాడు.

తమ్మివలస పంచాయితీలో గుమస్తా ఉద్యోగం అది !




రాజు భారంగా నిట్టూర్చేడు !

చదివిన చదువు తనకు యూనివర్శిటీ గోల్డుమెడలు సంపాదించిపెట్టినా- భుక్తి కోసం బ్రతుకుతెరవు చూపెట్టలేకపోయింది. ఫలితంగా తనని నమ్ముకొన్న తల్లిని, చెల్లెల్ని కూడా తనతో పాటు పస్తులు పెట్టి గత ఆరేళ్ళగా ఎంప్లాయిమెంటు ఆఫీసు చుట్టు ప్రదక్షిణలు చేసి చేసి- చివరకు ఊరుగాని వూరు బ్రతుకు వేటకి బయల్దేరేడు.

బస్సు ఆర్భాటంగా బయలుదేరింది. ముందు పోతోన్న బస్సుని ఓవర్‌టేక్ చేయమని క్లీనర్ డ్రైవర్ని ఈలలతో, అరుపులతో ఊదరగొట్టేస్తున్నాడు.

డ్రైవరులో వుత్సాహం పుంజుకొంది.

బస్సు దడదడలాడిపోతూ చలికి ఆగలేని ముసిల్దానిలా 'ఏ ముక్క కా ముక్క వూడిపోతుందా' అన్నట్లు ఊగిపోతూ పరుగెత్తుతోంది.

"కాసింత నోశెట్టమంటే కాలిమీన కాలేసుకునికూకున్నావు. పే..ద్ద గొవున్నరు నాగ! బస్సు నీ అమ్మా మొగిడిదేటే గుంటనంజికాన !"

ఉప్పు చేపలకన్నా కంపు కొట్టే ఘాటైన తిట్లు !

బస్సులో న్యూసెన్సు ఎలా వున్నా సముద్రపు గాలి ఒంటికి తగిలి రాజుకి ప్రాణం హాయిమనిపించింది.

రోడ్డు పొడుగునా సముద్రం-ఆకాశం చెట్టా పట్టా లేసుకొని బస్సుతోపాటుగా

పరిగెత్తుతున్నాయి

వాటితో పాటు రాజు మనసు కూడా భవిష్యత్తుమీద ఆశతో పరుగులు తీస్తోంది.

అక్కడ తను స్థిరపడగల్గితే చాలా కొద్దిలో సర్దుకొని మిగతా జీతం దాచి చెల్లెలు పెళ్ళి చేయాలి. తల్లికింక తను చేయాల్సిందేం లేదు. బతికినన్నాళ్ళూ గుప్పెడు మెతుకులు పెట్టగల్గితే చాలు. అంతే. చెల్లెలు సీత పెళ్ళి చేయగల్గితే ఆమెకు సర్వం చేసినట్లే.

తమ్మివలస పల్లెటూరు.

'అక్కడ తనకేం ఖర్చులుంటాయి కనుక. సినిమాలుండవు. తనకి సిగరెట్లు కాల్చే అలవాటు కూడా లేదు. పోతే ఎప్పుడయినా కాస్త టీ నీళ్ళు తాగే అలవాటుంది. అది తను మానుకోలేడు. వంట కూడా తనే చేసుకోగల్గితే ఖర్చు కలిసొస్తుంది' తమ్మివలస చేరేవరకూ రాజు ఆలోచిస్తూనే వున్నాడు.

ఉన్నట్టుండి ఈదురు గాలి ప్రారంభమైంది.

సముద్ర తీరానవున్న సరుగుడు చెట్లు గాలికి పైడితల్లి సంబరాలకి పూనకం వచ్చిన గణాచారుల్లా వూగుతోన్నాయి.

అప్పుడే బ్లూ ఎమల్షన్‌తో పెయింట్ చేసినట్లున్న ఆకాశం నల్లని మబ్బుల గుంపుతో మసిగుడ్డలా తయారయింది.

సముద్రం కాలుగాలిన పిల్లిలా వురకలెత్తుతోంది.

చిన్నచిన్న చినుకులతో ప్రారంభమైన వర్షం పెద్దదై ఒకటే ధాటిగా కురవటం మొదలెట్టింది.

వర్షపు జల్లు బస్సులోని పాసెంజర్సుని తడిపేస్తోంది.

ఆ బస్సుకి గ్లాసు విండోస్ లేవు.

రాజు నిరుత్సాహంగా బయటకి చూశాడు.

'చాలా రోజులకి ఏదో చిరుద్యోగం సంపాదించి జాయినవ్వడానికి వెళ్తుంటే ఓర్వలేనట్లు ఈ వర్షం ఏవిటి?' అనుకొన్నాడు విసుగ్గా.

"ఆ. ఎవరండీ బాబూ. తమ్మివల సొచ్చేసినాది. దిగండి బాబూ దిగండి." క్లీనర్ కీ యిచ్చినట్లు అరుస్తున్నాడు.

రాజు వులిక్కిపడిలేచి నిలబడి బ్యాగ్ అందుకొని బస్ దిగేడు.

రాజు దిగటమే ఆలస్యమన్నట్లు ఠక్కా మొక్కీలు తిని చొట్టలు పడ్డ బస్సు అక్కసంతా రోడ్డు గుంటల్లో నిలబడ్డ వర్షపు నీటి మీద చూపిస్తూ దబదబ శబ్దాలతో తరలిపోయింది.

ఒక్కసారిగా ఎర్రటి బురద నీళ్ళు ఉవ్వెత్తున లేచి రాజు తొడుక్కున్న తెల్లటి పాంటు నిండా స్ప్రే డిజైన్ వేసేయి.

"ఛీ. ఛీ. ఛీ." రాజు గాభరాగా విసుక్కున్నాడు.

వర్షం వుధృతం తగ్గింది. సన్నని తుంపర మంచులా కురుస్తోంది. రాజు అక్కడే నిలబడి క్షణంపాటు అటూ యిటూ చూసేడు.

అక్కడ ప్రత్యేకించి బస్టాండు అంటూ ఏదీ లేదు.

రోడ్డు పక్కగా ఉన్న చింత చెట్టుకు 'తమ్మివలస' అని సూచిస్తూ ఓ చెక్క బోర్డుమాత్రం ఉంది.

చింతచెట్టు పక్కగా ఓరెండు లారీలు ఆగివున్నాయి.

లారీ క్లీనరొకడు లారీ క్రింద బురదలో పాలసముద్రంలోని విష్ణుమూర్తిలా పడుకొని లారీ రిపేరు చేసుకొంటున్నాడు.

ఎదురుగా పెంకుటింటి వసారాలో చిన్న కాకా హోటల్లోంచి కాబోలు వడల వాసన వస్తోంది.

రాజుకి ఒక్కసారిగా ఆకలనిపించింది.

హోటల్లోకి నడిచాడు.

అక్కడ బల్లలమీద కూర్చొని లారీ డ్రైవర్లు కాబోలు కారం దట్టించిన ఎర్రటి బురద నీరులాంటి కూరతో చపాతీలు ఆవురావురమంటూ తింటున్నారు. వేడివేడి వడలు తీసి బేసిన్‌లో వేస్తోన్న బట్టతల వ్యక్తి రాజుని చూసి "రాండి బాబూ. రాండి. ఏటి కావాలి?" అన్నాడు వ్యాపార ధోరణిలో.

రాజు వూగిపోతోన్న బల్లమీద జాగ్రత్తగా కూర్చుంటూ "ఓ ప్లేటు వడ" అన్నాడు.

రాజు వడలు తింటుంటే "ఏ వూరేటి బాబూ తఁవది?" అన్నాడు అతనే.

అతను ఆ హోటలుకి సర్వర్ కమ్ ప్రొప్రయిటర్ సింహాచలం.

రాజు క్లుప్తంగా తను వచ్చిన పని చెప్పేడు.


"అయితే తఁవరీవూరు ఉద్యోగాని కొచ్చేసినారన్న మాట." అంటూ హర్షం ప్రకటించేడు.

"అవును. ప్రెసిడెంటుగార్ని కలవాలి. ఇల్లు చూపించగలవా?" అన్నాడు రాజు సింహాచలంతో.

"దానికేటి బాబూ. ఇది విజీనగరం నుంచీ తగరపొలస నుంచీ బస్సులొచ్చే టయము. బేరాలు పోతాయి. కూసేపు కూసున్నారంటే ఓటేలు కట్టేసికా ఎలిపోచ్చేద్దాం. ఏతంతారు?" అన్నాడు సింహాచలం టీ కలుపుతూ.

రాజు సరేనని తల వూపి కూర్చున్నాడు.

రోడ్డు మీద వర్షపు నీరు ఎర్రమట్టితో కలిసి రక్త ప్రవాహంలా సాగుతోంది.



పెంకుటింటి వసారా చూరునుండి వర్షపు బొట్లు వుండీ వుండి పడి నేలను గుంట లుగా చేస్తున్నాయి. వెలుగు క్రమంగా హరించుకుని పోయి చీకట్లు అలము కొంటున్నాయి.

"బావా. ఉత్సవం వున్నాదేటి?" యిరవై యేళ్ళ కుర్రాడొకడు వుషారుగా వచ్చి చెక్కబల్లమీద కాళ్ళారజాపి కూర్చుంటూ సింహాచలాన్ని అడిగేడు.

సింహాచలం అతనివేపు చురుగ్గా చూసి "నేదు! అడలున్నాయి. కావాలంటే అట్టు కెల్లు!" అన్నాడు.

"అయబాబో! అడలట్టుకెల్తే నా మెడ లొంచి తంతాది నాగుమని" అన్నాడు భయంగా భుజాలెగరేసి.

సింహాచలం చేతిలోని టీ గ్లాసు ఠపీ మని అరుగుమీద పెట్టి నడుంమీద చేతు లుంచుకుని విచిత్రంగా చూసి "ఓసోస్! ఈ కతలు నాకు సెప్పకు! నాగుమని నిన్ను తంతాదో, ముద్దెట్టుకుంటాదో నాకు తెల్దేటిరా నంజికొడక!" అన్నాడు.

"సాల్లే బావ! ఎవురైనా పెసిడెంటు గారికీ మాట మోసేరంతే నాదొక్కసింపీ గద్దు!" అన్నాడాకుర్రాడు చుట్టూ భయంగా చూస్తూ.

"సరిసరి. పెసిడెంటు బాబంటే గుర్తొచ్చేసినాదిరా యీర్రాజూ! ఈ బాబు పెసిడెంటు బాబుని కలవాలంట! తీసికెల్తావేటి?" అన్నాడు సింహాచలం.

"నయం! వుప్పుడా! ఆ బాబు ఆరు గంటలకే బుడ్డి బిగించేసి బుల్లి నరిసింల్తో తొంగుటాడని తెల్దేటి? రేపు రామ్మను!" అన్నాడు వెళ్ళిపోతూ వీర్రాజు.

సింహాచలం కుంపటి మీద టీకి నీళ్ళు వడేస్తూ "యిన్నారుగా! ఆడు ఆరింటి పాలేరు! పెసిడెంటు కూపీలన్నీ ఆడికి తెలుసు! మరింక యియ్యాలికి కుదర్దు! రేపెల్దిరగాని! ఇంతకీ తమ బసెక్కడ?" అడిగేడు.

"ఎక్కడైనా ఓ గది దొరుకుతుందా?" ఆశగా అడిగేడు రాజు.

"దొరక్క సత్తదేటండి! కాపోతే పట్నం నుంచొచ్చినోరు! తమకే మా కొంపలు నచ్చుతాయో లేదోనని...." అన్నాడు సింహాచలం అలవోకగా చూస్తూ.

"ఫర్వాలేదు. ఏదో రాత్రిపూట పడు కోడానికి అనువుగా వుంటే చాలు! సామాను కూడా నాకేం లేదు! నేనొక్క ణ్నే!" అన్నాడు రాజు.

"తమ కిట్టమయితే మా యింట్లోనే గదుంది. సూసుకోండి! పెంకుసూరే! డాబా గాదు మరి!" అన్నాడు.

ఇంతలో తగరపువలస, విజయనగరం బస్సులు రెండూ ఒకదాని వెనుక ఒక టిగా వచ్చి ఆగేయి!

సింహాచలం టీ లందించటంలో బిజీ అయిపోయేడు!


# స్పష్టంగా తెలుస్తోంది!




## పళ్లను శుభ్రపర్చడంతోపాటు చిగుళ్లను రక్షించడం కూడా... కేవలం ఫోర్‌హాన్స్ చేయగలదు.

పళ్లను శుభ్రంగా వుంచుకోవడంతోపాటు చిగుళ్లను ఆరోగ్యంగా వుంచుకోవడం చాల ముఖ్యం.



ఫ్లోరైడ్ గల ఫోర్‌హాన్స్ టూత్ పౌడర్‌తో పళ్లు శుభ్రమవటంతోపాటు చిగుళ్ల సంరక్షణ కూడా జరుగుతుంది. మరియు దీని నురుగు ఎంత రుచికరమైనదంటే నోటి నిండా ఎపుడూ కావాలనమే.

ఫ్లోరైడ్ గల

**ఫోర్‌హాన్స్ టూత్ పౌడర్**

వెలకంటే లాభం ఎంతో ఎక్కువ.

289 F-202 TEL

రాజు అక్కడే వున్న కిళ్ళీబడ్డిలో అరటి పళ్ళు కొనుక్కుని సింహాచలంతో బయలుదేరాడు.

సింహాచలం హోటలు కట్టేసి బస్సు రూట్ రోడ్డుదాటి ఎడం పక్కగా వున్న మట్టిరోడ్డు మీద నడక సాగించేడు.

రోడ్డంతా బురదగా వుంది.

"సూసుకోని నడండి. అటు పక్కగా పోకండి. మురిక్కాలవుంది" హెచ్చరించేడు సింహాచలం.

"మీ వూరికి కరెంటు లేదా?" ఆశ్చర్యంగా అడిగేడు రాజు.

"నేదండి! పెతీ ఎలక్సన్సికీ కరెంటు తెప్పించేత్తానని ఓట్లు గుంజుతాడండీ పెసిడెంటు! ఆయన పేరు ఈర్నాయుడు నెండి! మావంతా నిజవనీసీసుకుని ఓట్లే పెయ్యటం- ఆ బాబు గద్దెక్కిపోటం రివాజయిపోనాది! ఆయనింట్లోనూ- ఆయన ముండ యింట్లోనూ మాత్రం జామ్మని గాస్ దీపాలు ఎలిగిపోతుంటాయి! ఊరు వూరంతా సీకట్లో మణిగితే ఆయనకేటీ నట్టం?"

రాజు వింటున్నాడు.

"సర్లెండి. నా సొదసెప్పి తవని యిసిగించీసినానేటో! తవరి ఒణ్ణం సంగతి?" అన్నాడు సింహాచలం ఆసక్తిగా.

"ఈ రోజుకీ అరటి పళ్ళతో సర్దుకుంటాను. రేపు వంటకి ప్రయత్నించాలి" అన్నాడు రాజు చేతిలోని అరటి పళ్ళని చూపిస్తూ.

"తవకి వంటొచ్చా?" అడిగేడు సింహాచలం అనుమానంగా.

"రాదనుకో! నేర్చుకుంటాను."

తవకెందుకండీ బాబూ ఆ షాట్లు! నే నొంటిగాణ్ణి! నానెటూ నా కోసం నాలుగు మెతుకులొండుకుంటాను. తమకి యిట్టా వయితే అందులోనే గుప్పెడు గింజలేసేత్తాను! ఏతంటారు?" అన్నాడు సింహాచలం.

సింహాచలం ఆప్యాయతకి రాజు కరిగిపోయి సరేనన్నట్లు తల వంకించేడు.

దారి పొడుగునా చీకటిలో నిద్రపోతున్న గుడిసెలే ఎక్కువున్నాయి.

రోడ్డు మలుపుతిరుగుతోందగాఎందుకో రాజు గుండె ఒక్కసారిగా ఝల్లుమంది. ఉలిక్కిపడ్డట్లు చుట్టూ చూసేడు.

ఆ చీకట్లో మరింత చీకటిని పంచుతూ వూడలు దిగి విశాలంగా ఆవరించుకొన్న మర్రిచెట్టు మీద పడిందతని దృష్టి.

రాజు భయాన్ని దిగమింగుకొంటూ అన్ని వేపులా దృష్టి సారించేడు. ఆ వాతావరణం ఏదో జరగరానిది జరిగినట్లు భయంకరంగా వుంది.

"ఏటి బాబూ అలా సూస్తున్నారు?" అడిగేడు సింహాచలం.

"ఇక్కడ ఏవిటో భయంగా అన్పిస్తుంటేనూ" అన్నాడు రాజు.

"మీకు ఎలక్ట్రీ దీపాలు అలాటు కామోసు! అందుకే అలా అన్పిస్తున్నాది" అన్నాడు సింహాచలం రాజు అనుమానాన్ని తేలిగ్గా కొట్టిపారేస్తూ.

"అబ్బే అదేం కాదు! ఇందాకట్నుంచీ చీకట్లోనేగా వుంది! బహుశా ఈ చెట్టును చూసి కావొచ్చు" అన్నాడు చెట్టువంక తేరిపారా చూస్తూ.

ఆ మాటకి సింహాచలం పకపకా నవ్వేసేడు.

"నయం! ఈ సెట్టు వూరికి మాలచిమండి! ఏసంకాలం వచ్చేసినాదంటే ఊర్లో సగం జనానికి సల్లటి నీడ అదేనండి! పెతి ఏడూ కూలి జనం కొంపలంటుకోటం- ఆళ్ళు ఈ సెట్టుకే ఉట్టికట్టడం రివాజండి" అన్నాడు మర్రిచెట్టు గొప్పదనాన్ని పొగుడుతూ.

రాజు మరింకేం మాట్లాడలేదు.

ప్రెసిడెంటు వీరినాయుడు నల్లచేకు కుర్చీలో కూర్చుని లంకచుట్ట గుప్పు గుప్పుమంటూ కాలుస్తూ రాజువంకోసారి తేరిపారా చూశారు.

"నువ్వేనన్న మాట కొత్త గుమాస్తావి! సర్లే! ఎల్లి డూటీలో జేరిపో! డూటీ అంటే ఏటినేదు! మున్సీబు, కర్నం వస్తారు! లెక్కలు ఆళ్ళే సూస్తారు! కాసింత ఆళ్ళ యవ్వారం కనిపెట్టుండు" అంటూ పంచాయితీ ఆఫీసు తాళాలు విసిరేడు వీర్నాయుడు.


రాజు ఆ తాళాలందుకొని "మరెళ్ళొస్తానండీ" అన్నాడు వినయంగా.

"ఎల్లిపోచ్చులే! కాసేపు కూసో. కాపీ తాగెల్లొచ్చు! ఏటీ సదివేనన్నావ్?" అన్నాడు వీర్నాయుడు దర్జాగా.

"బి.ఏ. చదివేనండి."

"అబ్బో! కాలేజీ డిగ్రీసేసేశావన్న మాట. అద్సరే! మా గుంటొకతి వున్నాది. దానికి కాస్త యింగిలీసు సెప్పకూడదూ! పెళ్ళి సేద్దావంటే పెతి సన్నాసీ సదువు సంగతి అడిగే నంజకొడుకే! ఇంగిలీసు ముక్కల్ని నంజుకు తింటారా దొంగ నాకొడుకులు! అది తీసియ్! పెసిడెంటు కూతురు యింగిలీసు మాటాడద్దంటే నా పిస్టేజీ పెరుగుద్దనుకో! అందుకే నువ్వు దానికి నాలుగు ముక్కలు సెప్పు" ప్రెసిడెంటు మాటల్లో అభ్యర్థనకన్నా అధికారమే ధ్వనించింది.

ఇంతలో గజ్జెలగుర్రం లాంటి పర్సనాలిటీతో, పరికిణీ, ఓణీ, జడకుచ్చులు, అరచెయ్యంత పైట పిన్ను, నాగరం పెట్టుకుని అమ్మోరులాంటి అమ్మాయి యిత్తడి గ్లాసుల్లో కాఫీ తెచ్చింది.



"ఇదే. మా గుంట! నాగమని!" అన్నాడు ప్రెసిడెంటు గర్వంగా కూతుర్ని పరిచయంచేస్తూ.

నాగమణి బదులుగా నవ్వింది. కళ్ళని చెవులకి ముడేసినట్లు కాటుకదిద్దిన కళ్ళతో.

"ఏం. మాట్టారి దగ్గర యింగిలీసు నేర్చుకుంటావా?" అన్నాడు వీర్నాయుడు.

నాగమణి సంతోషంగా తల వంకించింది.

ఓరగా ఓసారి రాజుకేసి చూసి 'పట్నం పిల్లోడు; దోసవండు నాగున్నాడు' అనుకొంది.

రాజు కాఫీతాగి బయటపడ్డాడు.

* * *

రాజుని చూడగానే డాబామీదకు దారి తీసింది నాగమణి. డాబామీద చాప పరుస్తూ "ఇక్కడయితే బాగుంటుందని!" అంది వయ్యారంగా నవ్వుతూ.

రాజు యిబ్బందిగా కూర్చుని ఆమెకేసి ధైర్యంచేసి ఓ సారి చూసేడు. అడవి గేదెవద్దలా అనిపించింది నాగమణి రాజు కళ్ళకి.

"ఎంతవరకూ చదువుకున్నావ్?" అన్నాడు రాజు ఎటో చూస్తూ.

"తెలుగులో అన్నీ సదివీగల్ను!" గర్వంగా చెప్పింది నాగమణి.

"ఏమేం చదివేవు?" అన్నాడు రాజు.

"గోతిలో శవం, నడిచొచ్చిన ప్రేతం, కాస్కో నా దెబ్బ.... అబ్బో సాలా! సది వీసినాను! గుర్తునేవ్!" అంది ఒళ్ళు విరుచుకుంటూ. ఎప్పుడు పడిపోదామా అన్నట్లున్న నైలాను వోణీ సందుచూసుకొని జారిపోయింది.

గురిపెట్టినట్లున్న గుండెల్ని చూసి రాజు గాభరాగా ముఖం తిప్పుకున్నాడు.

నాగమణి ఇదేం గమనించే స్థితిలో లేదు.

ఓ ఇంగ్లీషు పాఠం తీసి తలొంచుకొని పాఠం చెబుతున్నాడు రాజు.

నాగమణి కసిగా రాజువంక పిల్లి రాతి పిలా చూస్తోంది.

ఇంతలో వీర్రాజు కాఫీ పట్టుకొని డాబామీద కొచ్చేడు.

వీర్రాజు రాజుకి కాఫీ గ్లాసందించి పక్కనే కూర్చున్నాడు.

"నువ్వెందుకిక్కడ? ఫో!" కసిరింది నాగమణి.

"మజ్జిలో నానేటి సేసినాను! నానూ నేర్చుకుంటా వింగిలీసు!" అన్నాడు వీర్రాజు.

"నీకు యింగిలీసే తక్కువయినాది! పే...ద్ద ఆపీసరుగోరు!" నాగమణి బండ నాలిక బయటపెట్టి వెక్కిరించింది.

వీర్రాజు అక్కడ వుండటం చాలా అవసరమనిపించింది రాజుకి.

"పోనీ వుండనివ్వు!" అన్నాడు.

వీర్రాజు 'చూసేవా' అన్నట్లు నాగమణి వేపు గర్వంగా చూసేడు.

నాగమణి ఇక లాభంలేదని పమిట సరిచేసుకుంది.

"మాస్టారు అడివిరావుళ్ళో ఎంటీ ఓళ్ళు వుంటారు" అంది నాగమణి సందర్భం లేకుండా.

రాజు వినిపించుకోనట్లు పాఠం చెప్పి ఆ రోజుకు బయటపడి వూపిరి పీల్చుకొన్నాడు.

రాజు మెల్లిగా సింహాచలం హోటల్ వైపు నడుస్తోన్నాడు. అతనికి రోజు రోజుకీ నాగమణి ప్రవర్తనపట్ల రోత పెరుగుతోంది.

ఆ అమ్మాయి అవసరం చదువుకాదు! పెళ్ళి! వచ్చిగా చెప్పాలంటే ఓ మగాడు కావాలి! ఆ పిల్ల తనని చూపుల్తోనే తడి వేస్తుందని రాజు గ్రహించేడు.

ఎలా ఈ రొంపిలోంచి బయటపడాలి. చూస్తే ప్రెసిడెంటు దగ్గర వుద్యోగం! మీ అమ్మాయి ప్రవర్తన బాగోలేదంటే అతను నమ్ముతాడా? నిజానికి తనా మాట ధైర్యంచేసి ప్రెసిడెంటుతో అనగలడా?

అతని గుండె దడదడలాడింది.

చుట్టూ చూసేడు. అతను సరిగ్గా మర్రిచెట్టు క్రింద కొచ్చేడు. అతనికి ఆశ్చర్యమనిపించింది.

మొదటి రోజయితే చీకట్లో వచ్చాడు కాబట్టి, భయపడ్డాడు! ఇప్పుడు పట్టపగలు! అయినా ఎందుకింతగా తన గుండె ఈ ప్రదేశానికి రాగానే గుబులుగా మారుతోంది!

అక్కడ మర్రిచెట్టు కింద రచ్చబండ మీద చాలామంది లోకాభిరామాయణం మాట్లాడుకొంటున్నారు. వాళ్ళకు లేని భయం తనకేవిటి?

రాజు ఆలోచిస్తూ సింహాచలం హోటల్ చేరుకున్నాడు.

మధ్యాహ్నం పన్నెండు గంటలు!

బస్సులు లేక సింహాచలం తీరుబడిగా బల్లమీద కాళ్ళు చాపుక్కూర్చుని బీడీ కాల్చుకొంటున్నాడు.

రాజుని చూడగానే బీడీ విసిరేసి చేతులు పంచెకు తుడుచుకుంటూ "రాండి బాబూ! ఏడేడిగా ఉప్మా వుంది తిందిరిగాని!" అన్నాడు.

రాజు మౌనంగా బల్లమీద కూర్చున్నాడు.

"అదేటి బాబూ! అలా డీలా పడిపోనారు. ఇంటిమీన గాలి మల్లిందేటి?" అన్నాడు సింహాచలం ఆశ్చర్యంగా రాజు వేపు చూస్తూ.

రాజు కాస్సేపు మాట్లాడలేదు.

తర్వాత మెల్లిగా అడిగేడు "నాగమణి గురించి నీకేమైనా తెలుసా?"

సింహాచలం పకపకా నవ్వేసేడు.

"ఏటి బాబూ! తమ మీదేసినాదేటి కన్ను! నాకు ముందే తెలుసులెండి. పయివేటవ గానే తవ పని సరసుకునేసినాను!"

"మరి ముందే చెప్పలేదేం?" నిష్టూరంగా అడిగాడు రాజు.

"నాను సెబితే మీ కొరిగేదేటి. పెసిడెంటు బాబంతటోడు అడిగేకా తవరు కాదనీసేగల్రా?" అన్నాడు సింహాచలం ఉప్మా ప్లేటు రాజు ముందుకి తోస్తూ.

రాజు ఆలోచిస్తూ తింటున్నాడు.

"అది ఒల్లు బలిసిన గుంటండి. మునుపోసారి సినీవాల్లో జేరాలని మద్రాసు పారెల్లొచ్చినాది! పెళ్ళి సంబందానికి నానే తీసికెల్లినానని సెప్పేదనుకోండి పెసిడెంటు. కర్నంబాబూరుకుంటాడేటి? అసలే తోక లేని కోతి! అందరికీ గుట్టు రట్టుసేసీసినాడు."

రాజుకి వినగా వినగా మతిపోతోంది.

"అది ఆవదాలవలస జీడిపప్పు. మాదగుల ఆల్వాలు తిని తెగ బలిసి పోనాదండి! తిమ్మిరి తీరక అలా కదం తొక్కేస్తన్నాదండి. దాని బాబు సేయించిన వొడ్డాణం దానికిప్పుడు దండొంకి అయిపోనాదండి." సింహాచలం నాగమణిని వర్ణిస్తూంటే స్పృహలో లేనట్లు చూసేడు రాజు.

* * *

రాజు ఆ రోజు ప్రయివేటు చెప్ప

దానికని గేటు తీసుకొని లోపలికి వెళ్తున్నాడు.

అక్కడ ధాన్యపు గాదె వెనుక కిల కిలా నవ్వు వినిపించి మెల్లెక్కబోతున్న వాడల్లా ఆగిపోయేడు.

"నీ కెలాగయినా రాజు బాబు మీద సూపడిపోనాది! బొత్తిగా నా మీద సీత కన్నేసేసినావు!" అది వీర్రాజు గొంతు.

"నా యిట్టం! మత్తెలో నీ కేటయినాది! నీ చేత పుస్తే కట్టించుకుంటానని గానీ రాసిచ్చినానా?" అది నాగమణి స్వరం.

"పుస్తె కడ్తానని నాను మాత్తరం అడిగినానా? ఒక్కరోజు రాపోతే గోలెట్టేసేదానివి? యిప్పుడు వంటిమీన సెయ్యేస్తే కస్సుమని పోతన్నావు! నానేటి తప్పుసేసినాను?" వీర్రాజు ప్రతిమాలుకొంటున్నాడు.

"ఏమో! నాకు మాత్తరం ఏటితెలుసు! మాట్టార్ని సూస్తే మతి పోతన్నాది! యమగోల్లో ఎన్.టి. వోళ్ళా వుంటాడు! నాకు యిదయ్యేకొద్దీ నా ఏపే సూడ్డు! నాకు పిచ్చెక్కిపోతన్నాది!"

"అంతేలే! ఒద్దన్నవోడి యెంటే పడతారు ఆడోళ్ళు! అదేటి మజానో! ఆ బాబు ఎంటీవోళ్ళాగుంటాడు సరే! నువ్వు దేటమ్మా.... అదే సీదేవి నాగున్నావేటి? నిన్ను సూడగానే ఆ బాబుకి సూరేకాంతాన్ని సూసినట్టు గుండె లటుక్కుమంటాది!" అన్నాడు వీర్రాజు అక్కసుగా.

"రాజూ!"

మెల్లెక్కబోతోన్న రాజు గతుక్కుమన్నట్లు నిలబడి పోయేడు.

ప్రెసిడెంటు వీర్నాయుడు అక్కడ గంభీరంగా నిలబడ్డాడు. "నాలుగు రోజులు ప్రయివేటుకు రానక్కరలేదు! మా గుంటకి బాగోలేదు!" అన్నాడు వీరినాయుడు.

అతని గొంతు కరకుగా వుంది.

ముఖం జేవురించి వుంది.

రాజు అలాగే నిలబడ్డాడు.

"నేను కబురెట్టినప్పుడు ఒద్దువిగాని ఎల్లిపో!"

రాజు వెనక్కు తిరిగి బయటకొచ్చేడు.

ప్రెసిడెంటు ప్రవర్తన అతనికి అర్థం కాలేదు. ఆలోచిస్తూ అతను సింహాచలం హోటలు వేపు నడిచేడు.

రాజు వెళ్ళేసరికి వీర్రాజు సింహాచలంతో గుసగుసలాడుతోన్నాడు. రాజుని చూసి వస్తానంటూ వెళ్ళిపోవటం ఆశ్చర్యమనిపించింది రాజుకి.

సింహాచలం రాజుకి టీ అందిస్తూ "తంవరిది యిన్నారా?" అన్నాడు.

"ఏ విషయం?" అన్నాడు రాజు సాలోచనగా.

"నాగుమనికి నెల తప్పినాదట! పెసిడెంటు అగ్గిమీన గుగ్గిలంలా మండిపోతన్నాడంట!" సింహాచలం గొంతుతగ్గించి చెప్పి ఆరాగా రాజుముఖంలోకి చూసేడు.

రాజు వులిక్కిపడ్డాడు.

"అందుకా ప్రెసిడెంటు ప్రయివేటొద్దు పొమ్మన్నాడు" అన్నాడు రాజు.

"ఇంట్లో కానా గొడవగానే వుందంట. ఆడెవడో సెప్పటం లేదంటా గుంట! నువ్వని అనుమానపడ్తన్నాడంట పెసిడెంటు!"

రాజుకి ఆ విషయం విషం తిన్నంత వెగటుగా వుంది.

మాట్లాడకుండా కూర్చున్నాడు.

"పెద్దోళ్ళ రంకులిలాగే వుంటాయి బాబూ! తవరు మాత్తరం యింకా పాడు ముండకి పయివేట్లు గట్టా సెప్పకండి, ఆ యీర్రాజుగోడు రంకు ధాస్తున్నాడుగాని ఆదాడి పనే!" అన్నాడు సింహాచలం ఓదార్పుగా రాజు ముఖంలోకి చూస్తూ.

రాజు లేచి నిలబడ్డాడు.

ఆలోచనల్లోనే మర్రిచెట్టు దగ్గర కొచ్చేడు. తెలీకుండానే గుండెల్లో తిరిగి గుబులు.... వెనక ఏదో సవ్వడి....ఎండుటాకుల చిటపటలు.

రాజు వెనక్కి తిరగబోయేడు.

రాజుకి ఆ అవకాశం యివ్వకుండా ....గొడ్డలి దెబ్బ మెడపైన పడింది.

"అబ్బా!" అంటూ కూలిపోయేడు రాజు.

రెపరెపలాడుతోన్న కళ్ళని బలవంతంగా తెరిచి చుట్టూ చూసేడు రాజు. ఆ చీకట్లో యమకింకరుల్లాంటి నల్గురు వ్యక్తులు రాజువైపు భీకరంగా చూస్తూ నిలబడి వున్నారు.

"నా కొడకా! పెసిడెంటుకే ఎసరెడతావు! మదవెక్కిపోనాదా!" బరిసె రాజు గుండెలకి గురిపెడుతూ గాలిలోకి లేచింది.

రాజు ఆఖరిసారిగా పైకి చూసేడు!

అతనికి అర్థమయింది. ఆ చెట్టు దగ్గర ఏదో జరిగి వుంటుందనే భయపడ్డాడుగాని తన జీవితానికి చరమగీతం ఆ ప్రదేశంలోనే పాడుతుందని గ్రహించలేకపోయేడు.

అర్థమయిన మరోక్షణంలోనే అతని తల మొండెం నుండి వేరుపడి దూరంగా తూలి పడింది.

ఆ ఘోరం చూడలేనట్లు మర్రిచెట్టు ఆకుల కళ్ళు మంచు బిందువుల కన్నీళ్ళు కార్చేయి.

